ప్రజాశక్తి
సోమవారం 26 డిసెంబర్ 2022
I
అల్లూరి సీతారామరాజు



సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పాడేరు: పాడేరు పాత బస్టాండ్ వద్ద సిపిఐ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కూడ రాధాకృష్ణ సభాధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ జెండా ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ, 1925 డిసెంబర్ 26న భారతదేశంలో కమ్యూనిస్టు అభిప్రాయాలు కలిగిన వారు దేశం నలుమూలల నుంచి కాన్పూర్ లో సమావేశమై పార్టీ ఆవిర్భావాన్ని ప్రకటించారని తెలిపారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కమ్యూనిస్టులను అరెస్టు చేసి, అనేక తప్పుడు కేసులు బనాయించి, దశాబ్దాల కాలంగా నిర్బంధంలో పెట్టారని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, కేరళలో పొన్నప్రవాయలార్ పోరాటాలు కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కన్వీనర్ అమర్, మచ్చమ్మ, వసంత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫాకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాశక్తి -పాడేరు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. సంక్షేమ పథకాల పొందేందుకు లబ్ధిదారులకు అవసరమైన అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానంపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ప్రకటనలో వివరించారు. నవరత్నాల పేరుతో ఇప్పటికే ఎన్నో పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరో కొత్త పథకం వైఎస్ఆర్ కళ్యాణమస్తు/వైఎస్ఆర్ షాదీ తోఫాకి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, భవన కార్మికుల కుటుంబాలకు వర్తిస్తుందన్నారు. పేద ఆడపిల్ల కుటుంబాలకు బాసటగా ఉండేందుకు, గౌరవప్రదంగా వివాహం జరిపించేందుకు ఈ పథకం కింద నగదు ప్రోత్సాహం అందిస్తారన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, ముస్లిమేతర అల్ప సంఖ్యాకులు, దివ్యాంగులు, రిజిస్టర్ చేసుకున్న అసంఘటిత రంగ కార్మికుల వివాహ ప్రోత్సాహకాన్ని పెంపు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు/వైఎస్ఆర్ షాదీ తోఫా పథకం 2022 అక్టోబర్ ఒకటవ తేదీ నుండి అమలు జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం పూర్తి వివరాలు అందించారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు/ వైఎస్ఆర్ షాదీ తోఫా కింద ఆర్థిక సహాయం ఎస్సీ, ఎస్టీల వివాహానికి లక్ష రూపాయలు, కులాంతర వివాహం చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ. 1.20 లక్షలు, వెనుకబడిన తరగతుల వారి వివాహానికి రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న బీసీలకు రూ.75 వేలు, మైనారిటీలకు లక్ష రూపాయలు, వికలాంగ ప్రతిభావంతులకు రూ.1.50 లక్షలు, రిజిస్టర్ చేసుకున్న అసంఘటిత కార్మికుల వివాహానికి రూ. 40 వేలు ప్రోత్సాహకం అందిస్తారు. ఈ పథకం 2022 అక్టోబర్ ఒకటో నుండి గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా అమలు అవుతుంది. అమ్మాయి వయసు 18, అబ్బాయి వయసు 21 ఏళ్ళు కచ్చితంగా నిండాలి. గ్రామాల్లో ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో నెలకు రూ.12 వేలకు మించకూడదు. వారి ఇళ్లలో నెలవారీ విద్యుత్ వాడకం నగటున 300 యూనిట్లు దాటకూడదు. మూడు ఎకరాలు మించి మాగాణి, పది ఎకరాలు మించి మెట్ట భూమి, రెండు కలిపి పది ఎకరాలు మించి భూమి ఉండనివారు అర్హులు. కుటుంబ సభ్యులెవరూ ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేయనివారు, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండనివారు అర్హులు. వివాహ ధ్రువపత్రం, వధూవరుల ఆధార్ కార్డులు, పెళ్లి ఫోటోలు, పెళ్లి కార్డు, వివిధ ప్రతిభావంతులకు సదరం ధ్రువపత్రం. వితంతు వివాహాలకు మొదటి భర్త మరణించినట్లు ధ్రువపత్రం లేదా వితంతు పింఛన్ కార్డు లేదా అఫిడవిట్, వధువు తరఫున ఉత్తీర్ణత ధ్రువపత్రం సమర్పించాలి. వివాహం జరిగిన 60 రోజులలోపు గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. లేదా నవశకం బెనిఫిషరీ మేనేజ్మెంట్ పోర్టల్(%https://gsws-nbm.ap.gov.in%)లో అభ్యర్థులు నేరుగా ఈ పథకానికి దరఖాస్తును చేసుకోవాలి. పూర్తి వివరాలకు గ్రామ సచివాలయం, డిఆర్డిఎ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



ఆందోళన చేపడుతున్న కాఫీ రైతులు

గిట్టుబాటు ధర కల్పించాలని
కాఫీ రైతుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ కాఫీ రైతులు సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని పెద్దకోట పంచాయతీ వేలమామిడి గ్రామంలో ఆందోళన చేపట్టారు. సిపిఎం మండల నాయకులు, వేంగడ మాజీ సర్పంచ్ సీదరి. కొండలరావు మాట్లాడుతూ, ఐటీడీఏ కాఫీ ఉపాధి హామీ పథకం కింద కాఫీ మొక్కల పెంపకం చేపట్టిన రైతులకు రూ.60 కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విదేశీ మార్కెట్లో వేల రూపాయలు ధర పలుకుతుంటే పండించే రైతులకు కనీసం గిట్టుబాటు ధర కల్పించ లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలని, వడ్డీ లేని రుణాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రాము, సన్యాసిరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన అవసరం

సదస్సులో గిరిజన న్యాయవాది రవితేజ



మాట్లాడుతున్న యువ న్యాయవాది రవితేజ

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మండలంలోని కుట్రవాడ పంచాయతీలో గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గిరిజన సదస్సు నిర్వహించారు. యువ న్యాయవాది మడివి రవితేజ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్లో పొందుపరిచిన గిరిజన ప్రాంత చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు ఏజెన్సీలో ఎల్‌టిఆర్ చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం ఇతర గిరిజనచట్టాలు పటిష్ఠంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పీసా గ్రామసభ తీర్మానాలను గౌరవించి, వాటిని అమలు చేయాలని కోరారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకి సంఘం జిల్లా అధ్యక్షుడు,పారా లీగల్ వాలంటరీ ఈతపల్లి సిరిమల్లెరెడ్డి అధ్యక్షత వహించగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రాంబాబు జిల్లా సహాయ కార్యదర్శి ఇరుపా అజయ్, మారేడుమిల్లి ఎంపిపి సార్ల లలిత కుమారి, సర్పంచ్ సార్ల రమాదేవి, మాజీ సర్పంచ్ సార్ల మంగిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గంగమ్మ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఆవుల ధర్మారెడ్డి, మండల నాయకులు బట్ట మల్లిరెడ్డి, కత్తుల రత్నారెడ్డి, గగనం వెంకటరెడ్డి, యువకులు కత్తుల రమణరెడ్డి, గగనం వెంకటరెడ్డి, పి.రంగారెడ్డి పి.చిరంజీవి, కత్తుల ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పిఒను సరెండర్ చేయాలి

ప్రజా సంఘాల నేతలు ▸▸ కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తూ, ప్రజాప్రతినిధులను హేళన చేస్తున్నారని, తక్షణమే పాడేరు ఐటీడీఏ పివోను ప్రభుత్వం సరెండర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏడు రోజులుగా నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఉద్యమ నాయకులు దీక్ష శిబిరం వద్ద క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రైస్తవ సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన వ్యతిరేకి పాడేరు ఐటీడీఏ పీవోను ప్రభుత్వం వెంటనే సరెండర్ చేయాలని, గిరిజన విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ కూడ రాధాకృష్ణ మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ ఎదురుగా నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నా.. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఐటీడీఏ పిఓను ప్రభుత్వం సరెండర్ చేసే వరకు ఉద్యమం ఆగదని, అవసరమైతే ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెదబయలు మండల తహసిల్దార్ ఆత్మహత్య చేసుకోవడానికి పాడేరు పిఓ వేధింపులే కారణమని వస్తున్న ఆరోపణలపై ఆయనను రక్షించడానికి సామాన్య గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం తగదన్నారు.గిరిజన ప్రాంతంలో విద్యార్థుల వరస మరణాలు జరుగుతుంటే పాడేరు ఐటీడీఏ పీఓకు మాత్రం కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని,హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ వేదికపై అన్ని ప్రజా, కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కో కన్వీనర్ కిల్లో ప్రభుదాస్, చిన్నారావు, మువ్వల లక్ష్మణరావు, కదేలి చంటిబాబు, గిరిజన నిరుద్యోగుల సంఘం అధ్యక్షులు కుమార్, కే.లతాకుమారి, జీవన్ కృష్ణ, గిరిజన సంఘం నాయకులు రామారావు, ప్రసాద్, రావణ్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరం వద్ద క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నేతలు



స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్

పిల్లలకు సాయం

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని నవజీవన్ నిర్వాశిత పిల్లల సేవా కేంద్రంలోని గిరిజన విద్యార్థులకు పాడేరు కు చెందిన సివిల్ కాంట్రాక్టర్ కే.ప్రభాకర్‌రావు ఉచితంగా స్వెట్టర్లు అందజేశారు. హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, స్థానిక మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం ఈ సేవ కేంద్రంలోని 27 మంది బాలలకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు చలి తీవ్రత దృష్ట్యా ఈ స్వెటర్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, వి.వెంకటరత్నం. బాబురావు మాస్టారు. అప్పన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఐక్య పోరాటం : ఐద్వా



బహుమతులు అందజేస్తున్న ఐద్వా నేత పద్మ

ప్రజాశక్తి- చింతూరు : మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం ఎర్రంపేట రచ్చబండ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో క్రిస్మస్‌ను వేడుకలను గ్రామపెద్ద పండు పిచ్చమ్మ ప్రారంభించారు. మహిళలకు ముగ్గులు, కుర్చీలాట, తాడాట పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులపై గొంతెత్తాలన్నారు. ప్రశ్నిస్తేనే సమస్యకు పరిష్కారం కనిపిస్తుందన్నారు. నేటికీ పసిపిల్లల నుంచి పండు ముదుసలి వరకు మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, వేధింపులు నిరాటంకగానే జరుగుగుతున్నాయన్నారు. పురుషాధిక్య సమాజంలో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం జరగడం లేదని, రాజకీయల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు నీటిమూటలగానే మిగిలిపోయాయన్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు, మల్లం సుబ్బమ్మ, రంగమ్మ, ఉపాధ్యాయిని మొరం కవిత, సీసం తులసి, పాండు ముత్తమ్మ, కారం అమల శ్యామల సాయమ్మ, పాంగ్రమ్, దుర్గ, మడివి జన్ని, కారం వెంకటలక్ష్మి, పాంగ్రమ్, నాగమ్మ పాల్గొన్నారు.



జలపాతం వద్ద పర్యాటకులు

కొత్తపల్లి జలపాతం కిటకిట

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం, క్రిస్మస్ పండగ కావడంతో పలు జిల్లాల నుండి పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. ఆదివారం ఒక్క రోజు 2800 మంది కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించినట్టు మేనేజర్ నవీన్, సూపర్వైజర్ వి.అభి తెలిపారు. ఇదిలా ఉండగా పర్యాటకులు అధిక స్థాయిలో వస్తుంగా ఇక్కడ సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేక పోవడం వల్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరారు.



షాపులు కేటాయిస్తున్న సిఐ

లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు


ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో ఎన్నో ఏళ్ల నుంచి ట్రాఫిక్ సమస్య ఉండేది. ముఖ్యంగా ఆదివారం సంత కావడంతో ట్రాపిక్ తీవ్ర అంతరాయం కలుగుతుందని గమనించిన అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జీడి బాబు, పంచాయతీ సర్పంచ్ సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్ రమేష్ ఆధ్వర్యాన ఆదివారం లాటరీ విధానంతో షాప్స్‌ను కేటాయించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జీడి బాబు మాట్లాడుతూ, అరకులోయ పర్యాటక ప్రాంతం కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేదని, ప్రస్తుతం సమస్య పరిష్కారం అయ్యిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో సచివాలయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - పెదబయలు:మండలంలో ఈనెల 26వ తేదీ నుండి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌ను గ్రామాల్లో నిర్వహిస్తామని ఏపిఓ కే ఎల్ఎన్ మూర్తి తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 2020-22 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ, సర్వ శిక్ష అభియాన్, హౌసింగ్, వాటర్ షేడ్, అటవీ శాఖకు సంబంధించి జరిగిన 6,084 పనులకు గానూ అన్ని పంచాయతీల్లో జనవరి 6 వరకు ఆడిట్ జరుగుందన్నారు.

జల విద్యుదుత్పత్తి లక్ష్యం చేరేనా..?

- సీలేరు కేంద్రం వార్షిక లక్ష్యం 476 మిలియన్ యూనిట్లు
- డిసెంబర్ 24నాటికి సగం కూడా పూర్తి కాని వైనం
- మిగిలిన మూడు నెలల్లో 236.73 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి సాధ్యమేనా?
- బలిమెల జలాశయంలో అరకొరగా నీటి నిల్వలు



సీలేరు జల విద్యుత్ కేంద్రంలోని ఉత్పత్తి యూనిట్

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది విద్యుదుత్పత్తి లక్ష్యాలు చేరుకోవడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి ఎపి జెన్‌కో ఉన్నతాధికారుల సూచనల మేరకు విద్యుదుత్పత్తి చేస్తున్నా, మున్ముందు ఇదే రీతిన సాగడం కష్టమేనని భావిస్తున్నారు. ఈ ఏడాది ప్రతికూల వర్షాలు వల్ల బలిమెల జలాశయంలో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడమే కారణమని అంటున్నారు. అయితే జెన్‌కో అధికారులు ఆశావహదృక్పథంలో ముందుకు సాగుతూ, టార్గెట్ చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీలేరు జలవిద్యుత్ కేంద్రంలోఈ ఏడాది ఏప్రిల్ నుంచి రానున్న మార్చి నెలాఖరులోగా 476 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేయాలని ఎపి జెన్‌కో ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి వరకు కేవలం 237.33 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి మాత్రమే జరిగింది. అంటే నిర్దేశించిన లక్ష్యంలో సగం కూడా ఇప్పటివరకు చేరుకోని పరిస్థితి. మిగిలిన మూడు నెలల్లో మిగిలిన 238.67 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తేనే శతశాతం లక్ష్యాన్ని పూర్తవుతుంది.

గత నాలుగు రోజులుగా జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని స్థానిక జలవిద్యుత్ కేంద్రంలో ప్రతిరోజూ రెండు మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేస్తున్నారు. అయితే ఈఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా బలిమెల జలాశయంలో ఆశించిన స్థాయిలోనీటి నిల్వలు లేకపోవడం ఎపిజెన్‌కో అధికారులకు తీవ్ర కలవరపాటుకు గురిచేస్తోంది. అందుబాటులో ఉన్న నీటి నిల్వలను వచ్చే ఏడాది జూన్ వరకు పొదుపుగా వాడుకుంటూ, ఆచితూచి విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

గత ఏడాది వర్షాలు అనుకూలించడంతో సీలేరు జల విద్యుత్‌కేంద్రం నుంచి డిసెంబర్ నాటికి 75 శాతం విద్యుదుత్పత్తి జరిగింది. దీంతో 2021- 22 ఏడాది చివరినాటికి విద్యుదుత్పత్తి లక్ష్యాలను పూర్తిచేయడమే కాకుండా అధిగమించారు. కానీ ఈ ఏడాదిఇప్పటివరకు 50శాతం లక్ష్యాలను కూడా పూర్తి చేయలేదు. రానున్న రోజుల్లో గోదావరి డెల్టా పంట పొలాలకు నీటి అవసరాలు ఉండడంతో, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఈఏడాది సీలేరు జలవిద్యుత్ కేంద్రం నుంచి నిర్దేశించిన విద్యుదుత్పత్తి టార్గెట్ చేరుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. నిర్దేశించిన లక్ష్యంలో మిగిలిన 238.67 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మిగిలిన మూడు నెలల్లో ఉత్పత్తి చేయాలంటే రోజుకు సగటున 2.75 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేస్తేనే లక్ష్యాన్ని పూర్తి చేయగలుగుతారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలను బేరీజు వేసుకుంటే ఈ ఏడాది విద్యుదుత్పత్తి లక్ష్యాలను చేరుకోవడం ప్రస్తుత పరిస్థితులను బట్టి సాధ్యం కాదనే చెప్పాలి. సీలేరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుదుత్పత్తి వార్షిక లక్ష్యాలను చేరుకునే దిశగా సంబంధిత జెన్‌కో అధికారులు ఎటువంటి చర్యలు చేపడతారో చూడాలి.

పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ ముప్పు

కొందరు సందర్శకుల బాధ్యతారాహిత్యమే కారణం
అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలి : రాంగోపాల్

ప్రజాశక్తి -సీలేరు: ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ వాడకంతో మానవాళికే పెనుముప్పు ఉందని భారతీయ ఆదివాసీ సమాఖ్య, ఎపి అధ్యక్షుడు గడుతూరి రామ్‌గోపాల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లాల్లో ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన అరకు వేలి, బొర్రా గుహలు, కటిక జలపాతం, జల తరంగిణి, రానా జల్లెడ జలపాతం, అనంతగిరి చాపరాయి మాడగడ, పాడేరు సమీపంలో వంజంగి కొండలు, కొత్తపల్లి జలపాతం, చింతపల్లి సమీపంలో లంబసింగి, తాంజంగి, దారకొండ, సీలేరు, ఐసిగడ్డ, ఒంటె ప్రాంతాలకు సందర్శనకు వచ్చేవారంతా ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ వాడేసి, విచ్చలవిడిగా ఎక్కడికక్కడే పడేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పర్యాటక ప్రాంతాలను కలుషితం చేయకుండా సందర్శకులు బాధ్యత వహించాలని, అదే సమయంలో అధికారులు దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాలని రాంగోపాల్ కోరారు.

తూతూమంత్రంగా ఆక్రమణల తొలగింపు

నోటీసుల జారీతో పైపైనే తొలగించిన వ్యాపారులు
అయిపోయిందని చేతులు ముడుచుకున్న అధికారులు



తొలగింపు తర్వాత రోడ్డుకు ఆనుకొని ఉన్న అక్రమ కట్టడాలు.

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నుండి ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని కొన్ని రోజులు క్రితం షాప్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో కొంతమంది దుకాణదారులు తూతూమంత్రంగా ఆక్రమణలను తొలగించారు. అధికారుల ఆదేశాలు పక్కనపెట్టి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఆక్రమణలు తొలగించకుండా రోడ్డు పక్కనే బొంగు చికెన్ దుకాణ వ్యాపారాలు పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో వాహనాలు రోడ్డుపై ప్రయాణించడానికి వీలు లేకుండా రద్దీగా తయారవుతుంది. పాదచారులు, చిన్నపాటి మోటార్ వాహనాలు ప్రయాణించడానికి వీల్లేకుండా తయారవుతుంది. అధికారులు చూడీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు బాహటంగానే అధికారులు తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతంలో తరచూ రద్దీ ఉండడంపై ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న బొంగు చికెన్ దుకాణాలను శాశ్వతంగా తొలగించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు...

వణికిస్తున్న చలిపులి

ఏజెన్సీలో గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
చలిగాలులు తోడవ్వడంతో జనం గజగజ



చలిమంటల వద్ద ఉపశమనం పొందుతున్న గిరిజనం

ప్రజాశక్తి - సీలేరు: ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో చలితీవ్రత అధికమై గిరిజనాన్ని వణికిస్తోంది. వారం రోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, చలిగాలులు వీస్తూ ప్రజలను వణికిస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటలకే చల్లనిగాలుల వీయడంతో చలి అధికమైంది. ఆదివారం 12 డిగ్రీల సెంటీగ్రేడ్ కనీస ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలి నుంచి ఉపశమనానికి మన్యవాసులలు చలిమంటలు వేసుకుని, ఇళ్లకే పరిమితమై సేదదీరుతున్నారుజ జీకే వీధి మండలం సీలేరు దారకొండ దుప్పులవాడ పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ఆరోగ్యరీత్యా వాకింగ్ చేసే యువకులు కూడా చలి తీవ్రతకు తాళలేక ఆరు గంటల వరకు బయటకు రాలేని పరిస్థితి. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత అధికమవుతుందని ఏజెన్సీవాసులు బెంబేలెత్తిపోతున్నారు.

గిరిజనుల మనుగడను దెబ్బతీసే...

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటాం : సిపిఎం

ప్రజాశక్తి -అనంతగిరి:గిరిజనుల మనుగడకు దెబ్బతీసే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకొని తీరుతామని సిపిఎం స్పష్టం చేసింది. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు. సర్పంచ్‌లు కిల్లో మొస్య, సోమ్మెల. రూతులు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారంగా హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాం చేసేందుకు పూను కుంటున్నాయన్నారు. అ నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోబోమని, గిరిజనుల పక్షాన పోరాటం ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుతో దానివలన, చిట్టంపాడు, నందనపురం, కొత్తవలస, కంబవలస, నందనపురం వంటి గ్రామాలు దెబ్బ తినడమే కాకుండా దిగువ ప్రాంతాలకు చెందిన పంట భూములు నాశనం అవుతాయన్నారు. గిరిజనుల జీవనం పూర్తిగా దెబ్బతింటుందని, ఇటువంటి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఏ విధంగా చేపడతారో తమకు అర్థం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై ఆయా గ్రామాల గిరిజన ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన ఉంటూ పోరాటాన్ని ఉధృతం చేసేందుకు తాము వారి వెంట అండగా ఉంటామన్నారు.చింతపల్లి మండలం ఎర్రవరం తరహా మాదిరిగానే ఇక్కడ కూడా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించి గిరిజన మనుగడకు దెబ్బతీచే పవర్ ప్రాజెక్టును తక్షణమే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

స్వయం పాలనతోనే మన్యం అభివృద్ధి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ప్రత్యేక స్వయం ప్రతిపత్తి కల్పనతోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని దండ కారణ్య విమోచన సమితి అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు కొర్రా ప్రసన్న కుమార్ అన్నారు. ఆదివారం గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దండకారణ్య విమోచన సమితి 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న మంగళవారం అరకులోయ రణజిల్డ వైష్ణవ్ రిసార్ట్స్ వద్ద దండకారణ్య విమోచన సమితి ఆధ్వర్యాన జాతీయ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల గిరిజన నాయకులు, మేధావులు వస్తున్నారని తెలిపారు. దండకారణ్య విమోచన సమితి అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు కొర్రా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగంలో హక్కులు, చట్టాలను అమలు చేసి ఆదివాసి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి గిరిజనులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆశాజనకంగా లేని మామిడి పూత

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలో ఈ ఎడాది కూడా మామిడి పూత ఆశాజనకంగా కనిపించడంలేదు. మామిడి తోటల వల్ల ఖర్చు తప్ప రాబడి రావడం లేదని రైతులు ఆందోళన చెందుతునానరు. మండలంలోని పోట్నూరు, రెడ్డిపల్లి, తునివలస, నేరేళ్లవలస, చిన్నపురం, ఐనాడ, బి.తాళ్లవలస, బుడ్డివలస, కోరాడ, వెంకటాపురం, రేవిడి, పాండ్రంగి, మద్ది, పద్మనాభం, అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం, బాందేవపురంలో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ఎడాది సువర్ణరేఖ రకం మామిడి చెట్లుకు పూత బాగా వచ్చింది. బంగినపల్లి, కలెక్టర్, ముంతమామిడి తదితర రకాల మామిడి చెట్లకు పూత సరిగా రావడంలేదని రైతులు చెబుతున్నారు. మండలంలోని కొవ్వాడ, గంధవరం, పెంట, అనంతవరం గ్రామాల్లో రైతులు ఎక్కువగా మామిడి తోటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పూత తక్కువగా రావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పూత రావడం కోసం మందులు పిచికారీ చేశారు. వచ్చిన పూతకు మకరం పట్టకుండా ఉండేందుకు కూడా మందులు పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం పొగమంచు లేకపోవడంతో వచ్చిన పూత నిలబడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. రెండేళ్లుగా మామిడి పూత లేక వ్యాపారులు తమవైపు కన్నెత్తి కూడ చూడలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎకరానికి మందులు పిచికారీకి రూ.30 వేలు వరకు ఖర్చు అయిందని రైతులు చెబుతున్నారు. పూత భాగా రాకుంటే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పలువురు రక్తదానం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన స్థానిక ఆలయం వద్ద ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని శ్రీ సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర టెక్నాలజీ కో-ఆర్డినేటర్ రాం ప్రసాద్, జిల్లా అధ్యక్షులు నాయుడు ప్రారంభించారు. ఎఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎ నాయుడు, సత్య సాయి, గౌరవాధ్యక్షులు చంద్రరావు, కన్వీనర్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



డుంబ్రిగుడలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



విఆర్.పురంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నేతలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:క్రిస్మస్ పండగను పురస్కరించు చుకుని మండలంలో క్రైస్తవులు ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నారింజవలస వేటేలు చర్చి, మండల కేంద్రంలో యుసి ఐఎం చర్చి వద్ద పాస్టర్లు సురేష్, భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల వద్ద చిన్నారులు క్రైస్తవ పాటలకు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

జి.మాడుగుల:మండలంలో పలు గ్రామాలలో ఆదివారం చర్చిల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. జి.మాడుగుల పంచాయతీ మద్దిమెట్ట గ్రామంలో సోలోమ్ చర్చిలో తిమోతి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించి 150 మంది పేద కుటుంబాలకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పెదబయలు:స్థానిక పెల్లోషిప్, ఎల్ఈఎఫ్ చర్చిలో తన తండ్రి కిరసాని శ్యాంసుందర్ జ్ఞాపకార్థం అరకు మార్కెటింగ్ డైరెక్టర్ కె.రామదాసు సీనియర్ పాస్టర్ సిహెచ్ అబ్రహం చేతుల మీదుగా క్రైస్తవులకు పండ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, సేవా దృక్పథంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అరకులోయలో....

అరకులోయరూరల్:ఏసుక్రీస్తు సూక్తులు ఆచరణీయమని అడోనోయ్ చర్చ్ పాస్టర్స్ సామ్యూల్, అర్జున్ పాల్ అన్నారు. ఆదివారం క్రిస్మస్ పండగను పురస్కరించుకొని అరకులోయ మండలంలోని పివిటీజీ కాలనీలో ఉన్న అడోనోయ్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పాస్టర్ సామ్యూల్ అర్జున్ పాల్ ప్రసంగిస్తూ..ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సహనం తో ప్రతి ఒక్కరూ జీవించాలని కోరారు. ఈ వేడుకల్లో సంఘ పెద్దలు ప్రభుదాస్, సూర్య ప్రకాశ్, పాండు, రాజకుమార్, రమేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విఆర్ పురం : మండలంలోని వివిధ చర్చిలలో క్రిస్మస్ వేడుకల్లో సిపిఎం బృందం పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రామవరం పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా నాయకులు పుల్లయ్య సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పార్టీ నాయకులు వంక సత్తిబాబు, చినమటపల్లి ఎంపిటిసి పూజల ప్రదీప్ కుమార్, శ్రీరామగిరి సర్పంచ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్,, పొడియం శ్రీరామ్ మూర్తి జుజారత్ గుండెపూడి లక్ష్మణరావు కారం సుందరయ్య కుంజ సుధీర్ తదితరులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఆట పాటలతో వేడుకను జరుపుకున్నారు.కేక్ కట్ అందరికీ పంచారు.

వి.ఆర్.పురం : వరరామచంద్రాపురం మండలకేంద్రంలో సంతపాకల రోడ్డులో షాలోమ్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్ ఆధ్వర్యంలో చిన్నారులతో పాటలు ఆటలతో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విందు ఏర్పాటుచేశారు.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు శనివారం అర్ధరాత్రి క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యుసిబిఎం, గేస్సమనే, ఇతర చర్చిల్లో క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యూసిబిఎం చర్చిలో ఎపి జెన్‌కో ఎస్ఇ కెవిఎ.ప్రశాంత్‌కుమార్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పాస్టర్ నాగాబాబు ఆధ్వర్యంలో సీఆర్‌పిఎఫ్ డిఎస్‌పి సురేష్ కేక్ కట్ చేశారు. గేస్సమనే ప్రార్థన మందిరంలో పాస్టర్ నానాజీ, బొడ్డగండి పంచాయతీ బచ్చులూరు నేతన్న ప్రార్థన మందిరంలో పాస్టర్ డేవిడ్ బంధుమిత్రులకు విందు భోజనం ఏర్పాటు చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



విఆర్.పురంలో కేక్ కట్ చేస్తున్న డేవిడ్ లివింగ్‌స్టన్ తదితరులు



సీలేరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేరాలు ఘోరాలు

దొంగ హల్‌చల్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆదివారం తెల్లవారుజామున దొంగ ఓ ఇంట్లో చొరబడి హల్‌చల్ చేసిన ఘటన విశాలాక్షినగర్‌లో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ద్వారకా జోన్ నేర విభాగపు సిఐ రమణమూర్తి కథనం ప్రకారం... విశాలాక్షినగర్‌లోని బివికె కళాశాల తరువాత వీధిలో ఉంటున్న చిన్నపిల్లల వైద్యులు యశ్వంత్‌శ్రీలత ఇంటి తలుపు విరగ్గొట్టి గుర్తు తెలియని లోపలకు ప్రవేశించాడు. తెల్లవారుజామున విధులకు వెళ్లాల్సిన డాక్టర్ యశ్వంత్ తలుపు తెరిచి ఉండడం గమనించి బయటకు రావడంతో దొంగ వెనుకనుంచి పరారయ్యేందుకు ప్రయత్నిచాడు. యశ్వంత్ వెంటనే దొంగను పట్టుకున్నారు. ఇంట్లో సభ్యులంతా కేకలు వేయడంతో డాక్టర్ చేతిని కొరికి దొంగ పారిపోయాడు. దొంగ సెల్ ఫోన్, టీషర్ట్ ఇంట్లో వదిలి పారిపోయాడు. సిఐ రమణమూర్తి ఆధ్వర్యాన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగ వదిలిన వస్తువులను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రుడిని తరలిస్తున్న ఆటో బోల్తా

- పలువురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని దిబిడి గ్రామానికి చెందిన చిన్ని ముత్యాలు ఆదివారం పిల్లలతో సరదాగా క్రికెట్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు పడిపోవడంతో తొడ భాగంలో కాలు విరిగిపోయింది. క్షతగాత్రుడిని కుటుంబీకులు ఆటోలో విశాఖపట్నం ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో చిన్నప్పన్నపాలెం వద్ద ఆటో ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కాలు విరిగిపోయిన ముత్యాలతోపాటు చిన్ని రాములమ్మ, తాటికొండ గణేష్,చిన్ని లక్ష్మణులకు గాయాలయ్యాయి. గాయపడిన తాటికొండ గణేష్, రాములమ్మలను వేరే ఆటోలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మానవత్వం చూపిన టిడిపి నేతలు

ఆటో ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపునకు 108 వాహనం కోసం ఎదురుచూస్తుండగా, అదే సమయంలో దిబిడి గ్రామంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లి వస్తున్న టిడిపి మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనురు మల్లునాయుడు తమ వాహనాల్లో క్షతగాత్రులను ఎక్కించి మానవత్వం చాటుకున్నారు. బంగారుమెట్టు వరకు తీసుకెళ్లి ఎదురుగా వచ్చిన 108 అంబులెన్స్ ఎక్కించారు.

కాలుష్య కోరల్లో బొడ్డపాలెం పరిసరాలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం పరిసర ప్రాంతాల్లో ఉన్న కర్మాగారాల నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల గ్రామాలతో పాటు పలు విద్యాలయాలు కాలుష్యంలో చిక్కుకుంటున్నాయి. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ యజమానులు నిబంధనలు పాటించకుండా దట్టమైన పొగ విడిచిపెడుతుండటంతో కర్మాగారం చుట్టూ ఉండే విద్యాలయాల విద్యార్థులు, గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వెల్లంకి బొడ్డపాలెం హార్బర్ స్కూల్, వెల్లంకి జగనన్న కాలనీ, వెల్లంకి హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, గారిపేట, బోయపాలెం, వేములవలస గ్రామాల నడుమ సుమారు 20 కంపెనీలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ప్లైవుడ్, ఐరన్, కంపెనీల నుంచి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు విపరీతమైన పొగ వెలువుడుతుండటంతో వాతావరణం కలుషితమవుతోంది.

ప్లైవుడ్ కంపెనీలో బాయిలర్‌లో వేసిన ప్లైవుడ్ చెక్క గమ్ముతో కూడుకొని ఉండడంతో మంటపేట్టేటప్పుడు అధిక పొగ వెలువుడుతోంది. ఈ కంపెనీల సమీపంలోని పాఠశాలల విద్యార్థులు, నివాస గృహాల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ కంపెనీలపై అనేకసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ద్వారకా ట్రాఫిక్ సిఐ కెఎన్ఎస్‌వి.ప్రసాద్ ఆధ్వర్యాన ఆదివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. టీటీడీ, రుషికొండ, ఆరిలోవ, బాలాజీనగర్ ప్రాంతాలలో చేపట్టిన అవగాహన కార్యక్రమాల్లో ప్రమాదాలు జరుగుతున్న తీరు, నివారణ చర్యలపై వీడియోల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మనుధర్మ శాస్త్ర దహన దిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

అమానవీయ మనుధర్మం అంతం కావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలో అన్ని రకాల అసమానతలకు, ముఖ్యంగా కులవ్యవస్థకు మనుధర్మ శాస్త్రమే మూలమని దళిత హక్కుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి వెంకటరమణ తెలిపారు. ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో మనుధర్మశాస్త్ర దహన దిన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమానవీయ మనుధర్మ శాస్త్రాన్ని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 1927 డిసెంబర్ 25న తగలబెట్టారని.. అదే స్ఫూర్తితో ప్రతి ఏడాదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 72 ఏళ్ళైనా ఇంకా మనుస్మృతి అమలవుతోందని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. భీమ్ సేన వార్ అధ్యక్షులు కె.చిన్నారావు మాట్లాడుతూ ధర్మశాస్త్రాల పేరుతో అధర్మం కొనసాగుతోందని, మానసిక బానిసత్వాన్ని పెంచిపోషిస్తున్నారని అన్నారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ ప్రాచీన కాలంలో ఈ మను ధర్మశాస్త్రమే సుదీర్ఘ కాలం పాటు ఒక రాజ్యాంగంగా కొనసాగిందని, దాన్ని వెనక్కి నెట్టి భారత రాజ్యాంగాన్ని మహనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మనకు అందించారని గుర్తు చేశారు. భారత నాస్తిక సమాజం అధ్యక్షులు వై.నూకరాజు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి సహా పలు మనువాద పార్టీలు, సంస్థలు మనుధర్మ శాస్త్రాన్ని పెంచి పోషిస్తూ, కులవ్యవస్థను కాపాడుతూ అసమానతలను పెంచుతున్నాయన్నారు. కార్యక్రమంలో పోర్టు ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఉమామహేశ్వరరావు, న్యాయవాది ఝాన్సీ, భీమ్ సేన వార్ ఉపాధ్యక్షులు వి.దుర్గారావు, గుడివాడ అప్పారావు, దళిత విముక్తి ప్రతినిధులు బంకపల్లి అప్పారావు, బి.సన్యాసమ్మ, డి.ప్రజ్ఞానంద్ పాల్గొన్నారు.

ఘనంగా మిరియాల వెంకటరావు జయంతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎవరు ఎక్కడ ఉన్నా అందరినీ సమానంగా ఆదరించాలన్నదే మిరియాల వెంకటరావు సిద్ధాంతమని, దానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో రాయలసేన ట్రస్టు ఆధ్వర్యంలో కీర్తిశేషులు మిరియాల వెంకటరావు 83వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ఎన్నో సందర్భాల్లో ఐక్యతలేక పోవడం వల్లే పూర్తిగా ఎదగలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు హనుమంతరావు, శివశంకర్ నుంచి నేటి బొత్స సత్యనారాయణ వరకూ ఎంతో మంది ఉన్నత స్థాయికి వెళ్లినప్పటికీ.. ఆశించిన స్థాయిలో ఎదగలేకపోయామన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు కాపులతో పాటు ఎవరు ఎక్కడ ఉన్నా,ఏ పార్టీలో ఉన్నా వారిని తప్పకుండా ఆదరించాలని కోరారు. మిరియాల వెంకటరావు కాపుల ఔన్నత్యానికి ఎంతగానో పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, రాయల సేన అధ్యక్షులు ఈశ్వర్, కాపు సామాజిక నేతలు గాదె బాలాజీ, దొరబాబు, కరణం కళావతి, శ్యామల పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

కైకాలకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఘన నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల కన్నుమూసిన సీనియర్ తెలుగు సినీ నటుడు కైకాల సత్యనారాయణకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఘన నివాళ్లర్పించింది. సత్యనారాయణ సంతాప సభను ఆదివారం ఉదయం ఎయు మానవ వనరుల అభివృద్ధి శాఖ కేంద్రంలో ఏర్పాటు చేసింది. తొలుత సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి.పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు. ఉపాధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావులు సత్యనారాయణ ఫొటోకు పూలదండ వేసి నివాళ్లర్పించారు.

వచ్చే ఏడాదంతా గ్లోబల్ సమ్మిట్లు

జి -20కి విశాఖ సారథ్యం - విశాఖ కలెక్టర్, జెసిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో



2023 సంవత్సరం అంతా గ్లోబల్ సమ్మిట్లతో విశాఖ హోరెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రానున్నది ఎన్నికల సంవత్సరం కావడంతో అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పెట్టుబడులు.. ఎపికి, అందునా ముఖ్యంగా విశాఖకు రావడం లేదన్న ప్రతిపక్షాల విమర్శలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడుల సదస్సులకు, ప్రపంచ దేశాల సారథ్యంలో తలపెట్టిన సదస్సులకు విశాఖను కేంద్ర బిందువుగా చేయాలన్న తలంపు ప్రభుత్వంలో కనిపిస్తోంది. దీంట్లో భాగంగా ప్రతిష్టాత్మక జి-20 సదస్సుకు విశాఖపట్నం వేదిక కానుంది.

జి-20 అధ్యక్ష దేశంగా భారత్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకు సదస్సులు, వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా దేశంలోని 56 నగరాలు, పట్టణాల్లో వివిధ అంశాలకు సంబంధించి 200 సదస్సులు నిర్వహించబోతోంది. ఈ నేపథ్యంలో ఎపి నుంచి విశాఖపట్నాన్ని కేంద్రం ఎంపిక చేసినట్లు సమాచారం. 2023 ఫిబ్రవరి 3, 4 తేదీల్లో, ఏప్రిల్ 24న విశాఖ వేదికగా వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలో నిర్వహించే జి-20 సదస్సుకు నోడల్ అధికారిగా ప్రొటోకాల్ డైరెక్టర్‌ను, సెక్యూరిటీ నోడల్ అధికారిగా రాష్ట్ర డిజిపిని నియమించారు.

విశాఖలో సదస్సు జరిగే మూడు రోజుల్లో ఆర్థిక రంగం, వ్యవసాయం, పర్యావరణం, విద్య, వైద్యం తదితర అంశాలపై 37 సమావేశాలు జరుగుతాయని జిల్లా అధికారులు తెలిపారు.

వేలాది మంది ప్రతినిధులు హాజరు

వివిధ దేశాల ఆర్థిక మంత్రులు, విదేశాంగ మంత్రులు, సెంట్రల్ బ్యాంకు గవర్నర్లు సదస్సుల్లో పాల్గొంటారని అధికారులు చెబుతున్నారు. తదనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేసేందుకు ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జెసి విశ్వనాథన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేస్తున్నారు. సదస్సు నిర్వహణకు మొత్తం 15 కమిటీలను ఏర్పాటుచేసి జెసి విశ్వనాథన్‌ను నోడల్ అధికారిగా నియమించారు. అతిథుల కోసం నగరంలోని స్టార్ హోటళ్లలో గదులను రిజర్వు చేస్తున్నారు.

'ఉక్కు' పరిరక్షణకు నిర్వాసిత కాలనీల్లో దీక్షలు

స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామన్న నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం


వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమం వేడెక్కుతోంది. ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ప్రజలు, కార్మికులు, నిర్వాసితులు ఎక్కడికక్కడ దీక్షలకు దిగుతున్నారు. ఉక్కు నిర్వాసిత సగర సంక్షేమ సంఘం, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో వడ్లపూడి నిర్వాసిత కాలనీ లక్ష్మీపురంలో స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఆదివారం నిరసన దీక్ష ప్రారంభమైంది. టిడిపి విశాఖ పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జివిఎంసి కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, లేళ్ల కోటేశ్వరరావు, బొండా జగన్, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్, నాయకులు జె.రామకృష్ణ తదితరులు దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ లక్షలాది మంది ప్రజలకు ఉపాధి కల్పించిందని అన్నారు. అటువంటి ప్రభుత్వ రంగ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం 32 మంది ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలను వృథా కానివ్వబోమని అన్నారు. ఇప్పటికీ 8500 మంది ఉక్కు నిర్వాసితులకు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. తక్షణమే వారందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమంతో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.అప్పలనాయుడు, పోరాట కమిటీ నాయకులు రామస్వామి, శ్రీనివాసరాజు, శ్రీనివాస్ నాయుడు, చిత్రాడ సన్యాసిరావు పరంధామయ్య సుబ్బన్న, జ్యోతి ప్రసాద్, కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, సంతోష్ కుమార్ రాజు, ఎం.దానయ్య, కె.రమణ, వీరాస్వామి, కె.వేణు, వి.వి.రమణ, కె.శ్రీనివాసరావు, దానప్పలు పాల్గొన్నారు.

గాజువాక : గంగవరం గ్రామంలో గంగవరం, జాలారిపల్లిపాలెం, పెద్ద పల్లిపాలెం, చిన్నపల్లి పాలెం ప్రజలు నిరాహార దీక్ష చేపట్టారు. వంద మంది యువకులు దీక్షలో పాల్గొన్నారు. జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి, పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పాదయాత్రలు

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వాసిత కాలనీల్లో ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో పాదయాత్రలు చేపట్టారు. నడుపూరు, సీతానగరం ప్రాంతాల్లో పాదయాత్రలు సాగాయి. సంఘం జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడారు. జనవరి 27న విశాఖ స్టీల్ తృష్ణా గ్రౌండ్‌లో ప్రజా కార్మిక గర్జన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాదయాత్రలో యూనియన్ అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు, నాగభూషణం పాల్గొన్నారు.

కలెక్టరేట్ : 8500 మంది ఉక్కు నిర్వాసితులకు నేటికీ ఉపాధి కల్పించలేదని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై.కొండయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారానికి 633వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు.



చెట్టును ఢీకొట్టి బోల్తా పడిన వ్యాన్

చెట్టును ఢీకొన్న బాతుల వ్యాన్

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- చింతూరు : బాతుల లోడ్‌తో వెళుతున్న వ్యాను చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నెల్లూరు జిల్లా నుంచి బాతుల లోడ్‌తో మహారాష్ట్ర వెళుతున్న వ్యాన్, చింతూరు మండలంలో ర్వేల గ్రామ వద్ద ఆదివారం తెల్లవారుజామున చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరు జిల్లా గనికొండ గ్రామానికి చెందిన కట్టా. నరేష్ (33) అనే వ్యక్తి అక్కడికక్కడే మతి చెందాడు. ఎరో ఇద్దరికి కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా హుటాహుటిన భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టిడిపి అధినేత చంద్రబాబు అభివృద్ధి గురించి ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. చంద్రబాబు మానసిక పరిస్థితి బాలేదని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని తెలిపారు. విశాఖ నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మానసిక పరిస్థితి దిగజారి పోయిందనడానికి బొబ్బిలి బహిరంగ సభనే నిదర్శనమన్నారు. రానున్న కాలంలో మరొక రాజకీయ విధ్వంసానికి ఆయన పథకాలు రచిస్తున్నారని తెలిపారు. విజయనగరంలో జరిగిన బహిరంగ సభకు ప్రజలను డబ్బులు ఇచ్చి తరలించారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూడా బాబు సభలకు రావడం మానేశారని అన్నారు. టిడిపి మహిళా విభాగం విజయనగరం జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి చంద్రబాబుతో ఫొటో తీసుకోవడానికి ప్రయత్నించగా అశోక్ గజపతిరాజు కూతురు ఆమెను పక్కకునేట్టేశారని, బిసి మహిళకు జరిగిన అవమానంగా దీన్ని భావిస్తున్నామని తెలిపారు.

ఓపెన్ చెస్ టోర్నీలో సత్య తేజశ్వర్‌కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎవిసిఎపి స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంటు పోటీలు ఆంధ్రా యూనివర్సిటీలో జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి 257 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో విశాఖ జిల్లాకు చెందిన మద్దూరి సత్యతేజశ్వర్ 7 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి రూ.5,500 నగదుతో పాటు ట్రోఫీని గెలుచుకున్నాడు. ద్వితీయ స్థానం శ్రీకాకుళం జిల్లాకు చెందిన సేతు మాధవ్ ఎలుమహంతికి, తృతీయ స్థానం విశాఖ జిల్లాకు చెందిన ఎన్.కార్తీక్‌కు దక్కాయి. వారికీ నగదు బహుమతులు, ట్రోఫీలు దక్కాయి. విజేతలకు ఎయు స్పోర్ట్స్ డైరెక్టర్ ఎన్.విజయ మోహన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ట్రెజరర్ కె.జ్వాలాముఖి, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.బాబూరావు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి ఘన సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి స్వశక్తితో ఎదిగిన నాయకుడని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రస్తుతించారు. వీరభద్ర స్వామి ఉప సభాపతిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో స్థానిక ఉడా చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అందరికీ ఆదర్శనీయులని అన్నారు. కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ తనను శాసనసభ ఉప సభాపతిగా ఎంపిక చేసి ఆర్యవైశ్య సామాజిక తరగతికి గౌరవాన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.